సాక్షి నిజామాబాద్

మంగళవారం । 28 । మే । 2024



డిగ్రీ పరీక్షల్లో ఆరుగురు డిబార్

తెలంగాణ యూనివర్సిటీ పరిధిలో కొనసాగుతున్న డిగ్రీ పరీక్షల్లో సోమవారం ఆరుగురు విద్యార్థులు డిబారయ్యారు.

- 8లో ▸



ముగిసిన క్యారం టోర్నీ

జిల్లాలో నిర్వహించిన ఆల్ ఇండియా ఇన్‌స్టిట్యూషనల్ క్యారం చాంపియన్‌షిప్ పోటీలు సోమవారం ముగిశాయి.

- 8లో ▸

గరిష్టం/కనిష్టం
42.3 /29.3

వాతావరణం

ఉదయం నుంచే ఎండ తీవ్రత పెరుగుతుంది. మధ్యాహ్నం ఉక్కపోతగా ఉంటుంది. సాయంత్రం ఆకాశం మేఘావృతమవుతుంది. అక్కడక్కడ వర్షం కురిసే అవకాశాలున్నాయి.

న్యూస్‌రీల్

తల్లి చేపల వేట షురూ..!



సాక్షి ఎఫెక్ట్..

బాల్కొండ: శ్రీరాం సాగర్ ప్రాజెక్టు దిగువన గల జాతీయ చేపపిల్లల ఉత్పత్తి కేంద్రంలో ఉత్పత్తి ప్రక్రియ ఆలస్యం కావడంపై 'సాక్షి' దినపత్రికలో గత శుక్రవారం 'మీనమేషాలు' అనే శీర్షికన కథనం ప్రచురితమైంది. దీంతో స్పందించిన అధికారులు తల్లి చేపల సేకరణ కోసం వేట షురూ చేశారు. ఎడపల్లి మండలం బ్రాహ్మణపల్లి చెరువులో నుంచి తల్లి చేపలు 400 కిలోలు సేకరించినట్లు మత్స్య అభివృద్ధి అధికారి లాయక్ మొహినొద్దీన్ తెలిపారు. మొత్తం 1500 కిలోల తల్లి చేపలు అవసరం ఉంటుందన్నారు. వివిధ చెరువుల్లోని నాణ్యమైన తల్లి చేపల కోసం మత్స్యకారులతో సంప్రదింపులు చేస్తున్నట్లు తెలిపారు. సకాలంలో చేపపిల్లల ఉత్పత్తి ప్రక్రియను ప్రారంభిస్తామని చెప్పారు.

పనులను వేగవంతం చేయాలి



బాల్కొండ: అమ్మ ఆదర్శ పాఠశాలలో భాగంగా చేపడుతున్న పనులను వేగవంతం చేయాలని డీపీవో తరుణ్‌కుమార్ ఆదేశించారు. సోమవారం బాల్కొండ మండలం కిసాన్‌నగర్, బాల్కొండ, ఇత్వార్‌పేట్ గ్రామాల పాఠశాలల్లో కొనసాగుతున్న పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాలల్లో చేపట్టిన పనులు పూర్తి చేస్తేనే డబ్బులు వస్తాయన్నారు. ఇదివరకే కాంట్రాక్టర్లకు నమ్మకం కలిగేందుకు కలెక్టర్ నుంచి 10 శాతం నిధులను విడుదల చేశారన్నారు. విద్యా సంవత్సరం ప్రారంభం నాటికి పనులు పూర్తి చేయాలన్నారు. ఎలాంటి కారణాలు చెప్పినా సహించేది లేదన్నారు. ఆయన వెంట ఎంపీడీవో విజయ్ భాస్కర్‌రెడ్డి, ఎంఈవో రాజేశ్వర్, ఎంపీవో వెంకటేశ్వర్లు తదితరులున్నారు.

నేషనల్ శాంపిల్ సర్వే అధికారిగా భరత్‌రాజ్



నిజామాబాద్‌నాగారం: నగరంలోని నేషనల్ శాంపిల్ సర్వే ఆఫీస్ ఉప ప్రాంతీయ కార్యాలయం నిజామాబాద్, ఆదిలాబాద్ జిల్లాల ఇన్‌చార్జిగా డాక్టర్ భరత్‌రాజ్ సోమవారం అసిస్టెంట్ డైరెక్టర్ జయరాం నుంచి బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు ప్రణాళిక రచన, వివిధ సంక్షేమ అభివృద్ధి పథకాల రూపకల్పన, వాటి అమలుకు కావాల్సిన పటిష్టమైన సమాచార వ్యవస్థకు మూలసాధనంగా నేషనల్ శాంపిల్ సర్వే కార్యాలయం ఉపయోగపడుతుందన్నారు.

రేపు వ్యాసరచన, చిత్రలేఖన పోటీలు

నిజామాబాద్‌నాగారం: జూన్ 5న ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో బుధవారం ఉదయం 10.30 గంటలకు బాలభవన్‌లో పర్యావరణ పరిరక్షణ అంశంపై వ్యాసరచన, చిత్రలేఖన పోటీలు నిర్వహిస్తున్నట్లు పర్యావరణ ఇంజినీర్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. పాఠశాల విద్యార్థులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. పోటీల్లో గెలిచిన విజేతలకు జూన్ 5న ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా అంబేద్కర్ భవన్‌లో జరిగే కార్యక్రమంలో బహుమతులు అందజేయడం జరుగుతుందన్నారు.

అయ్యప్ప స్కానింగ్ సెంటర్‌కు నోటీసు

నిజామాబాద్‌నాగారం: నిజామాబాద్ నగరంలోని ఖలీల్‌వాడిలో ఉన్న అయ్యప్ప స్కానింగ్ సెంటర్‌కు వైద్య ఆరోగ్యశాఖ అధికారులు సోమవారం నోటీసులు జారీ చేశారు. కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు ఆదేశాల మేరకు స్కానింగ్ సెంటర్‌కు నోటీసులు ఇచ్చారు. ఈ స్కానింగ్ సెంటర్‌లో స్కానింగ్ కోసం వచ్చిన మహిళల వీడియోలు, ఫొటోలు తీయడంతో ఫిర్యాదులు వచ్చిన విషయం తెలిసిందే. దీనిపై పూర్తిగా విచారణ చేయనున్నట్లు తెలిసింది.

నూతన విద్యా సంవత్సరం జూన్ 12న ప్రారంభం కానుంది. జిల్లాలో ప్రభుత్వ పాఠశాలలకు కావాల్సిన పుస్తకాల్లో చాలా వరకు ఇప్పటికే జిల్లాకు చేరుకున్నాయి. కానీ మండలాలకు తరలించడంలో ఆలస్యం అవుతోంది. దీంతో విద్యార్థులకు సకాలంలో పుస్తకాలు అందుతాయా అనే సందేహం వ్యక్తమవుతోంది. అధికారులు పర్యవేక్షిస్తున్నా.. ఇంకా 90 శాతం పుస్తకాలు తరలించాల్సి ఉంది.



సకాలంలో సరఫరా అయ్యేనా!

- జిల్లాకు చేరిన 5 లక్షలకుపైన పుస్తకాలు
- ఇప్పటి వరకు మండలాలకు పంపిణీ అయ్యింది 80 వేలే..
- మిగతా పుస్తకాలు ఎప్పుడు చేరేనో..!

నిజామాబాద్‌అర్బన్: ప్రభుత్వ బడుల్లో, గురుకులాలు, వసతిగృహాల్లో చదివే విద్యార్థులకు అవసరమయ్యే పాఠ్య, నోటు పుస్తకాలు జిల్లాకు చేరుకున్నాయి. కానీ వాటిని మండల కేంద్రాలకు పంపిణీ చేయడంతో ఇబ్బందులు ఎదురయ్యే అవకాశాలున్నాయి. దీంతో ఈసారైనా పాఠ్యపుస్తకాల పంపిణీని విద్యాశాఖ సకాలంలో పూర్తి చేస్తుందా అనే అనుమానాలు తలెత్తుతున్నాయి. గతేడాది సరఫరా సరిగ్గా చేయకపోవడంతో ప్రభుత్వ పాఠశాలలకు పాఠ్యపుస్తకాలు సకాలంలో ఇవ్వలేదు. రెండు నెలలు ఆలస్యంగా అందడంతో విద్యాబోధనకు అనేక ఆటంకాలు ఏర్పడ్డాయి. ఈ సమస్యను దృష్టిలో ఉంచుకొని పాఠశాలలు ప్రారంభం కాకముందే పాఠ్యపుస్తకాలు అందించాలనే జిల్లా విద్యాశాఖ ఈ సారి ప్రయత్నం చేస్తోంది. దీంతో ఈ క్రమంలోనే పాఠ్యపుస్తకాల పంపిణీ గతేడాది కంటే ప్రస్తుతం ఎక్కువగానే పంపిణీ చేశారు. కానీ మండలాలకు పంపిణీ చేయడంలో అవాంతరాలు తలెత్తుతున్నాయి. దీనిని అధిగమిస్తేనే పాఠ్యపుస్తకాలు సకాలంలో అందే అవకాశం ఉంది.

ఇదీ పరిస్థితి..

జిల్లాలో 1,234 ప్రభుత్వ పాఠశాలలు ఉన్నాయి. మొత్తం 2,23,043 మంది విద్యార్థులు ఉండగా.. ఈ ఏడాది 6,37,127 పాఠ్యపుస్తకాలు అవసరం ఉన్నాయి. ప్రస్తుతం జిల్లాకు 5,17,400 పుస్తకాలు పంపిణీ అయ్యాయి. మొదటి విడతలో ఈ పంపిణీ జరిగింది. జిల్లాలోని ఆయా మండలాలకు 81,632 పాఠ్యపుస్తకాలు అందించారు. మరో 15 రోజుల్లో మిగతా పుస్తకాల పంపిణీ చేయాల్సి ఉంది. ఇంకా 90 శాతం పాఠ్యపుస్తకాలు సకాలంలో అందించగలుగుతారా అనేది సందేహంగా మారింది. మరో వైపు పాఠ్యపుస్తకాల పంపిణీకి లారీల కొరత కూడా ప్రధాన కారణంగా ఉన్నట్లు విద్యాశాఖ అధికారులు పేర్కొంటున్నారు. పాఠశాలల పునఃప్రారంభానికి ముందే ఆయా మండల విద్యాశాఖ కార్యాలయంలో పాఠ్య పుస్తకాలు అందించాల్సి ఉంది. కానీ ఈ ప్రక్రియ నెమ్మదిగా కొనసాగుతోంది. ఈసారి కూడా పాఠ్యపుస్తకాల పంపిణీకి ఇబ్బందులు ఎదురయ్యే అవకాశాలున్నాయి.

పర్యవేక్షిస్తున్నా..

పాఠ్యపుస్తకాలను సకాలంలో అందించేందుకు జిల్లా విద్యాశాఖ అధికారి దుర్గాప్రసాద్ రోజు పర్యవేక్షణ చేస్తున్నారు. మిర్చి కంపౌండ్‌లోని పాఠ్యపుస్తకాల గోదాంలో పరిశీలన చేసి ఆయా మండలాల విద్యాశాఖ అధికారులకు ఆదేశాలు ఇస్తున్నారు. కానీ లారీల కొరత, ఇతరాత్ర సమస్యల వల్ల పంపిణీలో ఆలస్యం జరుగుతోంది. వీటిని అధిగమించి జూన్ ఒకటో తేదీ వరకు పాఠ్యపుస్తకాలు అన్నింటిని మండలాలకు సరఫరా చేసేందుకు విద్యాశాఖ అధికారి లక్ష్యం విధించారు. పంపిణీ కేంద్రం వద్ద అదనపు సిబ్బందిని సైతం కేటాయించారు.

సకాలంలో అందిస్తాం



పాఠ్యపుస్తకాలను సకాలంలో అందిస్తాం. ఇందుకు సంబంధించి సరఫరా కార్యక్రమం వేగంగా కొనసాగుతోంది. ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేస్తున్నాం. వచ్చిన పుస్తకాలను అక్కడికక్కడే వివరాలతో మండలాలకు చేరవేసే ప్రయత్నం చేస్తున్నాం. సకాలంలో పాఠ్యపుస్తకాలు అందజేస్తాం. – దుర్గాప్రసాద్, డీఈవో

బస్సులకు ఫిట్‌నెస్ పరీక్షలు

- జిల్లాలో 457 ప్రయివేటు పాఠశాలలు
- 1,209 స్కూల్ బస్సులు



ఖలీల్‌వాడి: జిల్లాలో జూన్ 12 నుంచి ప్రభుత్వ, ప్రయివేటు విద్యాసంస్థలు పునః ప్రారంభం కానున్నాయి. దీంతో విద్యార్థులను బస్సుల్లో తీసుకువెళ్లడానికి బస్సులు తప్పనిసరిగా ఫిటినెస్ ఉండాలి. దీంతో ప్రతియేటా స్కూల్స్ ప్రారంభం కాకముందే బస్సులను మే 16 నుంచి జూన్ 12 వరకు రవాణా శాఖ కార్యాలయంలో ఫిట్‌నెస్ పరీక్షలు చేయాల్సి ఉంటుంది. ఫిటినెస్ పరీక్షలు పూర్తయిన తర్వాత బస్సుల్లో విద్యార్థులను తీసుకెళ్లాల్సి ఉంటుంది. లేకపోతే ఆర్టీఏ అధికారులు బస్సులను సీజ్ చేయనున్నారు.

అధికారుల తనిఖీలు..

రవాణా శాఖ అధికారులు స్కూల్ బస్సులను తనిఖీలు చేస్తున్నారు. బస్సులు ఫిట్‌నెస్‌కు వచ్చినప్పుడు అధికారులు బస్సు కండిషన్, బస్సులకు రేడియం, గ్లాసులు, సైడ్ మిర్రర్‌తో పాటు ఇతర అంశాలను పరిశీలించిన తర్వాత ఫిట్‌నెస్ ఇస్తున్నారు. ఈ ఏడాది ఫిబ్రవరిలో పోలీసులు నిర్వహించిన తనిఖీల్లో వాహనాలు ఫిట్‌నెస్ లేనివి, ఇన్సూరెన్స్ లేకుండా, ఓవర్ లోడ్‌తో తిరుగుతున్న బస్సులు పట్టుబట్టాయి.

జిల్లాలో మూడు ఆర్టీఏ కార్యాలయాలు

జిల్లాలోని నిజామాబాద్, ఆర్మూర్, బోధన్‌లలో ఆర్టీఏ కార్యాలయాలు ఉన్నాయి. ఈ ఆర్టీఏ కార్యాలయంలో ఆయా ప్రాంతాలకు చెందిన స్కూల్, కాలేజీ బస్సులు ఫిట్‌నెస్ పరీక్షలు నిర్వహిస్తున్నారు. సంబంధిత ఎంవీఐ అధికారులు పరీక్ష నిర్వహించి ఫిట్‌నెస్ పత్రాలు జారీ చేస్తారు.

ఈనెల 15 నుంచే పరీక్షలు

జిల్లాలో ప్రయివేటు పాఠశాలలు, కళాశాలలకు సంబంధించి మొత్తం 1,209 బస్సులు ఉన్నాయి. కాగా మే 15 నుంచి ఈ బస్సులకు ఫిట్‌నెస్ పరీక్షలు నిర్వహిస్తున్నారు. ఈ ప్రక్రియ జూన్ 12 వరకు కొనసాగుతుంది. 15 ఏళ్ల నిండడంతో రోడ్లపై తిరగడానికి అవకాశం లేదు. ప్రస్తుతం పాఠశాలలు, కాలేజీల బస్సులు 700 వరకు ఉండగా 509 బస్సులు 15 ఏళ్ల బస్సులు ఉండడంతో వీటికి అనుమతి ఇవ్వడంలేదు. ఇప్పటి వరకు 150 బస్సులకు జిల్లాలోని ఆర్టీఏ అధికారులు ఫిట్‌నెస్ పరీక్షలు నిర్వహించారు. ఫిట్‌నెస్ లేకుండా బస్సులు నడిపితే.. అధికారుల తనిఖీలు చేసిన సమయంలో దొరికితే బస్సులను సీజ్ చేస్తారు.

ఫిట్‌నెస్ టెస్ట్ చేయించకపోతే బస్సులు సీజ్ చేస్తాం

స్కూల్, కాలేజీలకు సంబంధించిన బస్సులకు ఫిట్‌నెస్ పరీక్షలు తప్పనిసరిగా చేయించుకోవాలి. అలాగే రోడ్డు మీదకు బస్సులు వస్తే సీజ్ చేస్తాం. ఆర్టీఏ నిబంధనల ప్రకారం అన్ని పక్కాగా ఉంటే బస్సులకు ఫిట్‌నెస్ అనుమతి ఇస్తాం.

– ఉమామహేశ్వర్‌రావు, జిల్లా రవాణా శాఖ అధికారి, నిజామాబాద్

ఓట్ల లెక్కింపులో పొరపాట్లు జరగొద్దు



సీఎంసీ కౌంటింగ్ కేంద్రంలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు, సీపీ కల్మేశ్వర్

- కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు
- సీపీతో కలిసి కౌంటింగ్ సెంటర్ పరిశీలన

డిచ్‌పల్లి(నిజామాబాద్‌రూరల్): నిజామాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో పోలైన ఓట్ల లెక్కింపు ప్రక్రియలో ఏ చిన్న తప్పిదానికి తావులేకుండా కౌంటింగ్ ప్రక్రియ సజావుగా జరిగేలా అప్రమత్తతో విధులు నిర్వర్తించాలని రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు సూచించారు. డిచ్‌పల్లి సీఎంసీ కళాశాలలో జూన్ 4న కొనసాగనున్న ఓట్ల లెక్కింపును పురస్కరించుకుని కలెక్టర్ సోమవారం పోలీస్ కమిషనర్ కల్మేశ్వర్‌తో కలిసి కౌంటింగ్ సెంటర్‌ను పరిశీలించారు. పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని ఆయా అసెంబ్లీ సెగ్మెంట్ల వారీగా కౌంటింగ్ కోసం చేసిన ఏర్పాట్లను నిశితంగా పరిశీలించారు. కౌంటింగ్ హాళ్లలో ఏర్పాటు చేసిన టేబుళ్లు, బారికేడ్లు, సీసీ కెమెరాలు, స్ట్రాంగ్ రూంల వద్ద భద్రతా ఏర్పాట్లను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ఓట్ల లెక్కింపు కోసం పకడ్బందీ ఏర్పాట్లు చేశామని తెలిపారు. కలెక్టర్ వెంట అదనపు కలెక్టర్ అంకిత్, నగర పాలక సంస్థ కమిషనర్ మకరందు, సహాయ రిటర్నింగ్ అధికారులు, సంబంధిత శాఖల అధికారులు తదితరులున్నారు.

'పల్లె ప్రగతి' పనులపై ఆరా..

- జిల్లాలో పరిశీలిస్తున్న అధికారుల బృందం
- మండల, డివిజన్, జిల్లా స్థాయిల్లో గ్రేడింగ్ కోసం కసరత్తు
- ఐదు రకాల పనులపై క్షేత్రస్థాయిలో పరిశీలన



మోర్తాడ్‌లో కంపోస్టు తయారీ విధానాన్ని పరిశీలిస్తున్న డీఎల్‌పీవో

మోర్తాడ్(బాల్కొండ): పల్లె ప్రగతి కార్యక్రమం కింద చేపట్టిన ఐదు రకాల పనుల నిర్వహణ ఎలా ఉందనే అంశంపై క్షుణ్ణంగా తెలుసుకోవడానికి అధికారుల బృందం పల్లె బాట పట్టింది. అన్ని గ్రామ పంచాయతీల్లో పల్లె ప్రగతిలో భాగంగా ఐదు రకాల ఎసెట్స్‌ను నిర్వహిస్తున్నారు. వీటిని క్రమం తప్పకుండా అజమాయిషీ చేస్తున్నారా లేక పట్టించుకోకుండా నిర్లక్ష్యం వహిస్తున్నారా అనే విషయంలో పరిశీలన జరుపుతున్నారు. పల్లె ప్రగతిలో భాగంగా పల్లె ప్రకృతి వనం, నర్సరీ, క్రీడా ప్రాంగణం, వైకుంఠధామం, కంపోస్టు తయారీ షెడ్లను ఏర్పాటు చేశారు. ఉపాధిహామీ నిధులతో ప్రతి పంచాయతీలో ఈ ఐదు రకాల ఎసెట్స్‌ను నిర్వహిస్తున్నారు. వీటి పనితీరు ఆధారంగా పంచాయతీలకు ఏ, బీ, సీ గ్రేడ్‌లను ఇవ్వాలని రాష్ట్ర పంచాయతీరాజ్ అధికారులు నిర్దేశించారు. మండల, డివిజన్, జిల్లా స్థాయిల్లో గ్రేడింగ్ ఇచ్చి పనితీరు సరిగ్గా లేనిచోట లోపాలను సరిదిద్దడానికి చర్యలు తీసుకుంటున్నారు. జిల్లాలో ఉన్న 530 జీపీలను డీపీవోతో పాటు డివిజనల్ లెవల్ పంచాయతీ అధికారి, మండల పంచాయతీ అధికారులు పరిశీలించాల్సి ఉంది. డీపీవో కొన్ని జీపీలను పరిశీలిస్తే డీఎల్‌పీవోలు తమ డివిజన్‌లోని మెజారిటీ జీపీలను సందర్శించాల్సి ఉంది. ఎంపీవోలు మాత్రం అన్ని పంచాయతీల పరిధిలోని ఎసెట్స్‌ను పరిశీలించి గ్రేడింగ్ ఇవ్వాల్సి ఉంది. పంచాయతీరాజ్ పోర్టల్‌లో వివరాలు నమోదు చేయాల్సి ఉంటుంది. దీంతో ఈ నెల 25న ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. మరో, వారం పది రోజులపాటు గ్రామాల సందర్శన పూర్తిచేసి గ్రేడింగ్‌ను ఇవ్వాల్సి ఉంది. ఈ విధానం వల్ల పంచాయతీల నిర్వహణ ఎలా ఉంది, పల్లె ప్రగతి లక్ష్యం నెరవేరిందా లేదా అనే విషయంలో స్పష్టత రానుంది. గ్రేడింగ్ ఆధారంగానే పల్లె ప్రగతి పనుల నిర్వహణ తేలిపోతుందని అధికారులు చెబుతున్నారు.

పరిశీలన కొనసాగుతోంది

పల్లె ప్రగతి ఎసెట్స్ నిర్వహణ విషయంలో అన్ని పంచాయతీల్లో అధికారుల సందర్శన కొనసాగుతుంది. పల్లె ప్రగతి పనితీరును అధికారులు స్వయంగా పరిశీలించి పంచాయతీల నిర్వహణ సమర్థవంతంగా ఉండేలా చూస్తున్నాం. లోపాలు ఉంటే సరిదిద్దుకుని ముందుకు సాగాల్సి ఉంది.

– శ్రీధర్, ఎంపీవో

సన్నాలకు బోనస్ ఎలా?

- సన్న రకం పండించిన అందరికా..
- కొనుగోలు కేంద్రాల్లో విక్రయించిన వారికేనా..!
- మార్గదర్శకాలు వస్తేనే స్పష్టత



మోర్తాడ్‌లో ఆరబోసిన సన్నరకం ధాన్యం

మోర్తాడ్: సన్నరకం వరి పండించిన రైతులకు క్వింటాల్‌కు రూ.500 చొప్పున బోనస్ ఇస్తామని రాష్ట్ర ప్రభుత్వం చేసిన ప్రకటనతో రైతుల్లో సంతోషం వ్యక్తమవుతోంది. అయితే బోనస్ ఎలా ఇస్తారనే స్పష్టత లేదు. మార్గదర్శకాలు జారీ చేస్తేనే ఎంత మంది రైతులు, ఎన్ని ఎకరాల్లోని పంటకు లబ్ధి చేకూరుతుందనే విషయంలో స్పష్టత వచ్చే అవకాశం ఉందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. సాధారణంగా వర్షాకాలం సీజన్‌లో జిల్లాలో చాలా వరకు సన్న రకాలనే సాగు చేస్తారు. యాసంగి సీజన్‌లో కూడా సన్న రకాలను సాగు చేయడం రెండేళ్ల నుంచి మొదలైంది. అకాల వర్షాలు, వడగండ్ల వర్షాలకు తట్టుకునే వరి వంగడాలను ఉత్పత్తి చేయడంతో యాసంగిలోనూ సన్న రకాలు సాగవుతున్నాయి. సన్న రకం ధాన్యానికి మార్కెట్‌లో డిమాండ్ ఉండడంతో వ్యాపారులకే విక్రయిస్తారు. ఇలాంటి సందర్భంలో సన్నరకాలను సాగు చేసి వ్యాపారులకు విక్రయించినా బోనస్ ఇస్తారా.. లేక కొనుగోలు కేంద్రాల్లో విక్రయించే వారికే వర్తింపజేస్తారా అనే విషయంలో ప్రభుత్వం స్పష్టత ఇవ్వాల్సి ఉంది. ప్రస్తుతం ఎన్నికల కోడ్ అమలులో ఉండడంతో సన్న రకాలకు బోనస్ అంశంలో ప్రభుత్వం మార్గదర్శకాలను జారీ చేయలేదు. కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం విక్రయించకుండా వ్యవసాయ శాఖ రికార్డుల ప్రకారం సన్న రకాలను సాగు చేసిన రైతులకు బోనస్‌ను ఏ విధంగా వర్తింపజేస్తారనే విషయాన్ని ప్రభుత్వం వివరించాల్సి ఉంది.

అందరికీ ఇవ్వాలి



సన్న రకం సాగు చేసిన ప్రతి రైతు వివరాలను వ్యవసాయ శాఖ నమోదు చేస్తుంది. ఆ రికార్డుల ప్రకారం సన్నాలు సాగు చేసిన అందరికీ బోనస్‌ను వర్తింపజేయాలి. లేదంటే రైతులు నష్టపోతారు. కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించాలంటే వర్షాకాలం సీజన్‌లో సాధ్యం కాదు. – చిన్న రాజేశ్వర్, రైతు, మోర్తాడ్

రైతులను వంచించకూడదు



వరి సాగు చేస్తే ప్రతి క్వింటాలుకు రూ.500 బోనస్ అని ప్రకటించారు. ఇప్పుడు సన్న రకాలకే అని మాట మార్చడం సరికాదు. సన్న రకాలు, దొడ్డు రకాలు అని తేడా లేకుండా ఏ రకం వరి సాగు చేసినా వ్యవసాయ శాఖ రికార్డులను దృష్టిలో ఉంచుకుని బోనస్ అందించాలి. – కౌద లింబాద్రి, రైతు, తొర్తి

ఈదురుగాలుల బీభత్సం

- విరిగిపడిన కరెంట్ స్తంభాలు
- పలుచోట్ల త్రుటిలో తప్పిన ప్రమాదం
- సాలూర క్యాంప్ వద్ద అంతర్రాష్ట్ర రోడ్డుపై పడిపోయిన స్తంభం



సాలంపాడ్ క్యాంప్‌లో విరిగిన విద్యుత్ స్తంభం

బోధన్: భారీ ఈదురుగాలులు బీభత్సం సృష్టించాయి. ఆదివారం రాత్రి భారీ ఈదురు గాలులతో కూడిన తేలిక పాటి వర్షం కురవడంతో గ్రామాలు అతలాకుతలమయ్యాయి. సాలూర మండలంలోని సాలూర క్యాంపు ప్రధాన కూడలి వద్ద మహారాష్ట్ర వెళ్లే అంతర్రాష్ట్ర రోడ్డుపై కరెంట్ స్తంభం విరిగిపడింది. ఈ సమయంలో వాహనాల రవాణా లేకపోవడంతో పెనుప్రమాదం తప్పింది. ఇదే గ్రామంలో పలు ఇళ్ల రేకుల పైకప్పులు ఎగిరిపోయాయి. సాలంపాడ్ క్యాంప్ గ్రామ శివారులోని పంట పొలాల్లో 25కు పైగా కరెంట్ స్తంభాలు విరిగిపడ్డాయి. విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ నేలకొరిగింది. సాలూర మండల కేంద్రంలోని దళితవాడలో పెంకుటిళ్ల పైకప్పులు దెబ్బతిన్నాయి. ఈదురుగాలులకు నివాసాల పైకప్పు ఎగిరిపోయి నష్టపోయిన తమకు పరిహారం చెల్లించి ఆదుకోవాలని బాధితులు అధికారులను వేడుకున్నారు.



సాలూర క్యాంప్ వద్ద అంతర్రాష్ట్ర రోడ్డుపై విరిగిపడిన విద్యుత్ స్తంభం



ఈదురుగాలులకు ఇంటి పైకప్పు రేకులు ఎగిరిపోవడంతో మిగిలిన గోడలు

క్లుప్తంగా

నిధి ఆప్కే నికట్‌పై అవగాహన



డిచ్‌పల్లి: పింఛన్‌దారులు, పీఎఫ్ చందదారుల కోసం ప్రతినెలా 27వ తేదీన నిర్వహిస్తున్న నిధి ఆప్కే నికట్ 2.0 కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి శ్రవణ్ కుమార్ సూచించారు. మండలకేంద్రంలోని రమన్ బాయి సీ పటేల్ బీడీ కంపెనీలో సోమవారం నిధి ఆప్కే నికట్ 2.0 కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రతినెలా నిర్వహించే సదస్సులో పరిష్కరించే సమస్యలపై పింఛన్‌దారులు, పీఎఫ్ చందాదారులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సిబ్బంది బాలనాథ్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి 'ఓపెన్' పరీక్షలు

నిజామాబాద్‌అర్బన్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ యూనివర్సిటీలో 2023-24 సంవత్సరానికి అడ్మిషన్ తీసుకున్న మొదటి సంవత్సరం సెమిస్టర్-1 విద్యార్థులకు నేటి(మంగళవారం) నుంచి పరీక్షలు నిర్వహించనున్నట్లు గిరిరాజ్ కళాశాల ప్రిన్సిపల్ పి రామ్మోహన్‌రావు, అధ్యయన కేంద్రం రీజినల్ కో ఆర్డినేటర్ రంజిత సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థులు ఆన్‌లైన్ నుంచి హాల్‌టికెట్ డౌన్‌లోడ్‌చేసుకొని తప్పనిసరిగా ఐడీ ప్రూఫ్‌తో పరీక్ష కేంద్రానికి రావాలన్నారు. ఇతర వివరాలకు 73829 29612 నంబర్‌ను సంప్రదించాలని ఆయన సూచించారు.

ప్రభుత్వపరంగా ఆదుకుంటాం



బాన్సువాడ రూరల్ : గాలివాన బీభత్సం కారణంగా నష్టపోయిన బాన్సువాడ మండలం బోర్లం గ్రామానికి చెందిన బాధితులను సోమవారం కామారెడ్డి అదనపు కలెక్టర్ చంద్రమోహన్ పరామర్శించారు. ఆర్థికంగా నష్టపోయిన బాధితులు ఆందోళన చెందవద్దని ప్రభుత్వం ద్వారా సాయం అందేలా కృషి చేస్తామని హామీ ఇచ్చారు. వెంటనే అధికారులతో విచారణ చేయించి నివేదిక పంపాలని ఆర్డీవో రమేశ్‌రాథోడ్‌ను ఆదేశించారు. ఇళ్లు కోల్పోయి తీవ్రంగా నష్టపోయిన వారందరికీ వెంటనే రేషన్ బియ్యం ఇవ్వాలని తహసీల్దార్ వరప్రసాద్‌ను ఆదేశించారు. గ్రామంలో విద్యుత్ పునరుద్ధరణ పనులు శరవేగంగా పూర్తిచేయించాలని ట్రాన్స్‌కో అధికారులను ఆదేశించారు. గ్రామస్తులు పార్టీలకు అతీతంగా గ్రామంలో సహాయక కార్యక్రమాల్లో పాల్గొనడం హర్షనీయమన్నారు. ఎంపీవో సత్యనారాయణరెడ్డి, ఎంపీటీసీ శ్రావణి దేవేందర్‌రెడ్డి, ప్రత్యేకాధికారి నాగేశ్వరావు, నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, నర్సింలు, దేవేందర్‌రెడ్డి, సతీష్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

నేడు దోస్త్
ప్రత్యేక సర్టిఫికెట్ల పరిశీలన

తెయూ(డిచ్‌పల్లి): డిగ్రీ ప్రవేశాల కోసం ప్రత్యేక కేటగిరి విభాగంలో తెలంగాణ యూనివర్సిటీ పరిధిలోని అనుబంధ కళాశాలల్లో వెబ్ ఆప్షన్లు ఇచ్చిన విద్యార్థుల సర్టిఫికెట్లను పరిశీలించనున్నట్లు 'దోస్త్' కో ఆర్డినేటర్ సంపత్‌కుమార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ప్రక్రియ రెండురోజులపాటు కొనసాగుతుందని పేర్కొన్నారు. ప్రత్యేక కేటగిరిలో ఎంపికైన విద్యార్థినీవిద్యార్థులు తమ ఒరిజినల్ ధ్రువపత్రాలతో తెయూ అకడమిక్ ఆడిట్ సెల్ విభాగంలో హాజరు కావాలని సూచించారు. మంగళవారం పీహెచ్‌సీ (దివ్యాంగులు) విద్యార్థుల సర్టిఫికెట్లను, బుధవారం రోజున ఎన్‌సీసీ సర్టిఫికెట్లను పరిశీలన ఉంటుందని తెలిపారు. దోస్త్ లో రిజిస్ట్రేషన్, వెబ్ ఆప్షన్ ఇచ్చుకున్న విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, మరిన్ని వివరాలకు 98489 04793, 83744 06322 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

బీడీ కార్మికులకు నూతన అగ్రిమెంట్

- యాజమాన్యాలతో యూనియన్ల చర్చలు
- వెయ్యి బీడీలకు రూ.4.25 పెంపు
- ఉమ్మడి జిల్లాలో 2.50 లక్షల మంది కార్మికులకు ప్రయోజనం



ఖలీల్‌వాడి/మోర్తాడ్: బీడీ పరిశ్రమపై ఆధారపడి పని చేస్తున్న బీడీలు చుట్టే కార్మికులు, నెలవారీ వేతనాలు పొందే ఉద్యోగులు, ప్యాకర్లతో యాజమాన్యాలు చేసుకున్న అగ్రిమెంట్ గతనెల 30వ తేదీన ముగిసింది. ఈ నేపథ్యంలో గత శనివారం కార్మిక సంఘాల నాయకులు హైదరాబాద్‌లో బీడీ యాజమాన్యాలతో సమావేశమై కూలి, వేతనాల పెంపుపై చర్చలు జరిపి నూతన అగ్రిమెంట్ చేసుకున్నారు. బీడీ చుట్టే కార్మికులకు చెల్లించే కూలిని ఆయా కంపెనీలు స్వల్పంగా పెంచాయి. వెయ్యి బీడీలకు గతంలో రూ.245.08 చొప్పున కూలి చెల్లించేవారు. తాజాగా రూ.4.25 పెంచిన యాజమాన్యాలు రూ.249.99 చొప్పున చెల్లించనున్నాయి. బీడీ ప్యాకర్లకు ప్రస్తుతం పొందుతున్న వేతనంపై నెలకి అదనంగా రూ.3650, నెలవారీ వేతనం పొందే బట్టీవాలా, చెన్నీవాలా, బీడీ సాటర్లకు రూ.1700 పెంచేందుకు ఒప్పుకున్నాయి. నూతన అగ్రిమెంట్ మే 1 నుంచి అమలులోకి రానుంది. కొత్త వేతనం రెండేళ్ల పాటు అమలులో ఉండేలా ఒప్పందం కుదిరింది.

2.50 లక్షల మంది బీడీ కార్మికులకు లబ్ధి

ఉమ్మడి జిల్లాలో పనిచేస్తున్న 2.50 లక్షల మందికిపైగా కార్మికులకు లబ్ధి చేకూరనుంది. నిజామాబాద్, కామారెడ్డిలో టెలిఫోన్ కంపెనీ, చార్‌భాయ్, దేశాయి, శివాజీ కంపెనీలతోపాటు పలు బీడీ కంపెనీలు ఉన్నాయి. ఈ కంపెనీలు ఉమ్మడి జిల్లాలో బ్రాంచ్‌లు ఏర్పాటు చేసుకొని బీడీలు చేయిస్తున్నారు. 2.50లక్షల మంది కార్మికుల్లో 1.50 లక్షల మందికి పీఎఫ్ సౌకర్యం ఉండగా.. లక్ష మంది కార్మికులకు లేదు. బీడీ సాటర్లు, చెన్నీవాలా, గంపవాలాలు సుమారు 3 వేల మంది వరకు పని చేస్తుంటారు.

బీడీ కార్మికుల డిమాండ్లు ఇవే..

- బీడీలపై ఉన్న 28 శాతం జీఎస్టీ తగ్గించడంతో పాటు పీఎఫ్ పరిధిలో ఉన్న సీబీటీ (సెంట్రల్ బ్యూరో ట్రస్టీ) ప్రతినిధులు బీడీ కార్మికులకు ప్రతి నెలా రూ.4వేల పెన్షన్ సౌకర్యం కల్పించాలి.
- బీడీ కట్టలపై ఉన్న పుర్రె గుర్తు ఆంక్షను తొలగించాలి.
- కార్మికులకు మెరుగైన వైద్యం అందించడానికి సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ ఏర్పాటు చేయాలి.
- బీడీ కార్మికులకు ప్రత్యేకంగా ఇళ్లు, పండ్లు, పూలు, కూరగాయల సాగు, కోళ్ల పరిశ్రమ, గేదెలు, గొర్రెల పెంపకానికి కుట్టు శిక్షణ, ఎంబ్రాయిడరీ, చేతి వృత్తులు, అగరబత్తుల తయారీ, పేపర్‌ప్లేట్స్, పేపర్ గ్లాస్, బట్టల బ్యాగ్‌లు, పచ్చళ్ల తయారీపై శిక్షణ ఇచ్చి ఉపాధి మార్గాలు చూపించాలని కార్మికులు కోరుతున్నారు.

పెంచినా అసంతృప్తే..

కూలిని కొంతమేర పెంచడంతో కార్మికులకు ఊరట లభించినట్టైంది. కాగా తమ శ్రమకు తగిన ఫలితం లభించడం లేదని వెయ్యి బీడీలకు రూ.300ల చొప్పున చెల్లిస్తే బాగుండేదని కార్మికులు పెదవి విరుస్తున్నారు. బీడీల ఉత్పత్తి ఎంత మాత్రం తగ్గక పోయినా యాజమాన్యాలు మాత్రం బీడీలు అమ్మకం తగ్గిపోయిందని చెబుతున్నాయి. అనేక రాష్ట్రాల్లో బీడీల కొనుగోలు గతంలో మాదిరిగా లేదని కంపెనీలు పేర్కొంటున్నాయి. కొన్ని కంపెనీలు బీడీలను పీఎఫ్ ఉన్న కార్మికులతో కాకుండా వర్థి రూపంలో నగదు చెల్లింపుల పేరుతో బీడీలను చుట్టిస్తున్నాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. కార్మికుల శ్రమను గుర్తించి కూలి పెంచడాన్ని యాజమాన్యాలు పట్టించుకోవడం లేదని పలువురు పేర్కొంటున్నారు. ఏది ఏమైనా స్వల్పంగా కూలి పెంచడంపై బీడీ కార్మికుల్లో అసంతృప్తి వ్యక్తమవుతోందని చెప్పొచ్చు.

ప్రత్యామ్నాయ ఉపాధి కల్పించాలి

బీడీ కార్మికులకు పెన్షన్ అందించాలి. దీంతో పాటు పని దినాలు కల్పించాలి. లేనిపక్షంలో ప్రత్యామ్నాయ ఉపాధి కల్పించాలి. ఆకు, తంబాకు కార్మికులకు సరిపోయేంత ఇవ్వాలి. దీంతోపాటు నాణ్యమైనవి అందించాలి. బీడీ కార్మికులకు అదనపు సౌకర్యాలు కల్పించాలి.

– వనమాల కృష్ణ, ఐఎఫ్‌టీయూ రాష్ట్రనాయకులు, నిజామాబాద్

మా శ్రమను గుర్తించడం లేదు

బీడీ కంపెనీల యాజమాన్యాలు మా శ్రమను గుర్తించడం లేదు. మేము ఎంతో శ్రమకు ఓర్చి బీడీలు చేస్తున్నాం. కంపెనీల యాజమాన్యాల ఆస్తులు అమాంతం పెరుగుతున్నాయి. మా బతుకులు మాత్రం మారడం లేదు. బీడీ పరిశ్రమను నమ్ముకున్న వారికి కొంతైనా మేలు జరిగేలా చూడాలి.

– లక్ష్మి, బీడీ కార్మికురాలు, మోర్తాడ్

చర్చల్లో పాల్గొన్న నాయకులు వీరే..

బీడీ యాజమాన్యాలతో హైదరాబాద్‌లో నిర్వహించిన చర్చల్లో తెలంగాణ ప్రగతిశీల బీడీ వర్కర్స్ యూనియన్ (ఐఎఫ్‌టీయూ) రాష్ట్ర అధ్యక్షుడు వనమాల కృష్ణ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం నరేందర్ తదితరులతోపాటు బీడీ యజమానుల సంఘం (ది తెలంగాణ బీడీ మ్యానుఫ్యాక్చరర్స్ అసోసియేషన్) అధ్యక్షుడు హితేంద్ర ఉపాధ్యాయ, ప్రధాన కార్యదర్శి ధర్మేంద్ర గాంధీ, దేశాయి బీడీ ప్రొడక్షన్ మేనేజర్ రశ్మీకాంత్ పటేల్, రమన్ భాయ్ పటేల్, చార్‌భాయ్ బీడీ ప్రభాకర్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.



బీడీ కంపెనీల యాజమాన్యాలతో చర్చల్లో పాల్గొన్న కార్మిక సంఘాల నాయకులు

రాష్ట్రస్థాయి తైక్వాండోలో ప్రతిభ



నిజామాబాద్‌నాగారం: రాష్ట్రస్థాయి ఓపెన్ తైక్వాండో చాంపియన్ షిప్‌లో నగరంలోని క్యూరియస్ అకాడమీ క్రీడాకారులు సత్తాచాటారు. హైదరాబాద్‌లోని ఎల్‌బీ నగర్‌లో ఈనెల 26వ తేదీన నిర్వహించిన చాంపియన్‌షిప్‌లో జిల్లాకు చెందిన 56 మంది క్రీడాకారులు పాల్గొని 18 స్వర్ణ, 12 రజత, 20 వెండి పతకాలు సాధించారు. మొత్తం 56 మంది పాల్గొని 50 పతకాలు సాధించారని జిల్లా తైక్వాండో అసోసియేషన్ జనరల్ సెక్రెటరీ వినోద్‌నాయక్, ట్రెజరర్ వినోద్ తెలిపారు. రాష్ట్రస్థాయి పోటీల్లో అత్యధిక పతకాలు సాధించి, నిజామాబాద్ జిల్లాను ఓవరాల్ చాంపియన్‌గా నిలిపిన క్రీడాకారులను ఈ సందర్భంగా పలువురు అభినందించారు.

డిగ్రీ పరీక్షల్లో ఆరుగురు డిబార్



కామారెడ్డిలో పరీక్షాకేంద్రాన్ని తనిఖీ చేస్తున్న తెయూ ఆడిట్ సెల్ డైరెక్టర్ ఘంటా చంద్రశేఖర్

తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీ పరిధిలో కొనసాగుతున్న డిగ్రీ రెగ్యులర్, బ్యాక్‌లాగ్ సెమిస్టర్ పరీక్షల్లో డిబార్ల పర్వం కొనసాగుతోంది. సోమవారం నిర్వహించిన సెమిస్టర్ పరీక్షల్లో ఎల్లారెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాల పరీక్షాకేంద్రంలో నలుగురు, మోర్తాడ్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల సెంటర్‌లో ఒకరు, ధర్పల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాల సెంటర్‌లో ఒకరు మొత్తం ఆరుగురు విద్యార్థులు మాల్‌ప్రాక్టీస్‌కు పాల్పడుతూ పట్టుబడినట్లు అకడమిక్ ఆడిట్ సెల్ డైరెక్టర్ ప్రొఫెసర్ ఘంటా చంద్రశేఖర్ తెలిపారు. నాల్గో సెమిస్టర్ రెగ్యులర్ పరీక్షలకు 8,193 మంది విద్యార్థులకు గాను 7,714 మంది హాజరు కాగా 416 మంది గైర్హాజరయ్యారని, మధ్యాహ్నం నిర్వహించిన ఐదో సెమిస్టర్ బ్యాక్‌లాగ్ పరీక్షలకు 8,484 మంది విద్యార్థులకు గాను 7,937 మంది హాజరు కాగా 556 మంది గైర్హాజరైనట్లు వివరించారు. కామారెడ్డిలోని పలు పరీక్షా కేంద్రాలను ఆడిట్ సెల్ డైరెక్టర్ ప్రొఫెసర్ చంద్రశేఖర్, జాయింట్ డైరెక్టర్ అతీక్ సుల్తాన్‌ఘోరీ తనిఖీ చేశారు.

ముగిసిన క్యారం చాంపియన్‌షిప్





విజేతలకు ట్రోఫీలు అందజేస్తున్న క్యారమ్ అసోసియేషన్ ప్రతినిధులు

నిజామాబాద్‌నాగారం: ఆల్ ఇండియా ఇన్‌స్టిట్యూషనల్ క్యారం చాంపియన్‌షిప్ పోటీలు సోమవారం ముగిశాయి. ఈనెల 23వ తేదీ నుంచి 26 వరకు నగరంలోని నవ్యభారతి గ్లోబల్ స్కూల్‌లో యూనియన్ బ్యాంక్ సౌజన్యంతో టోర్నీ కొనసాగింది. పురుషుల, మహిళల సింగిల్స్ విభాగంలో యోగేశ్ పరదేశి, మంతషా ఇక్బాల్ విజేతలుగా నిలిచారు. అలాగే వెటరన్ మహిళల విభాగంలో నాన్సీ అలెక్స్ (నాబార్డ్), శోభ కామత్ మధ్య ఫైనల్‌మ్యాచ్ జరగగా నాన్సీ అలెక్స్ విజయం సాధించారు. పురుషుల విభాగంలో సయ్యద్ మోసిన్ ఖాసీం (జేఐఎస్ఎల్), శాంతిలాల్ (మహారాష్ట్ర) జరిగిన మ్యాచ్‌లో మోసన్ ఖాసీం విజయం సాధించారు. సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో ఇంటర్నేషనల్ క్యారమ్ అసోసియేషన్ కార్యదర్శి వీడీ నారాయణ, ఆల్ ఇండియా క్యారమ్ అసోసియేషన్ ప్రతినిధి భారతీనారాయణ, తెలంగాణ క్యారమ్ అసోసియేషన్ అధ్యక్షుడు సంతోష్‌కుమార్ విజేతలకు ట్రోఫీలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. టోర్నీ ఓవరాల్ చాంపియన్‌షిప్‌ను పీఎస్‌పీబీ జట్టు సాధించిందని వారు తెలిపారు. టోర్నీ నిర్వహణకు సహకరించిన యూనియన్ బ్యాంక్ వారికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. అనంతరం రెఫరీలకు, అంపైర్లకు మెమెంటోలు, సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో ఐఓసీఎల్ సేల్స్ అండ్ రిటైల్ మేనేజర్ మోహన్ కిశోర్, ప్రవీణ్, శోభన్, రాజు పాల్గొన్నారు.

ధాన్యాన్ని త్వరగా అన్‌లోడ్ చేయాలి



దేశాయిపేట్ రైస్‌మిల్లులో వివరాలు తెలుసుకుంటున్న అదనపు కలెక్టర్ చంద్రమోహన్

బాన్సువాడ/బాన్సువాడ రూరల్: రైస్‌మిల్లులకు వచ్చిన ధాన్యం లారీలను త్వరగా అన్‌లోడ్ చేయాలని అదనపు కలెక్టర్ చంద్రమోహన్ అన్నారు. సోమవారం మండలంలోని దేశాయిపేట్ ఉమమహేశ్వరి రైస్‌మిల్‌ను ఆయన సందర్శించారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతుల వద్ద తూకం చేసిన ధాన్యంను రైస్‌మిల్‌లకు పంపిస్తున్నామని, రైస్‌మిల్లుల్లో లారీలో వచ్చిన ధాన్యంను ఖాళీ చేయడానికి మిల్లర్లు జాప్యం చేస్తున్నారని, వెనువెంటనే లారీల్లో ఉన్న ధాన్యంను రైస్‌మిల్లుల్లో దింపుకుని లారీలను త్వరగా పంపించాలని సూచించారు. లారీల కొరతతో కొనుగోలు కేంద్రాల్లో ఇబ్బందులు వస్తున్నాయని ఆయన అన్నారు. ఆయన వెంట ఆర్డీవో రమేశ్ రాథోడ్ తదితరులు ఉన్నారు.

40 కేంద్రాల్లో మాత్రమే ధాన్యం..

కామారెడ్డి టౌన్ : ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియ పూర్తి కావచ్చిందని ఇంకా 40 కేంద్రాల్లో మాత్రమే ధాన్యం మిగిలి ఉందని జిల్లా పౌర సరఫరాల అధికారి మల్లికార్జున్ బాబు అన్నారు. సోమవారం కామారెడ్డిలోని పలు రైస్‌మిల్లులను పౌర సరఫరాల ఇన్‌చార్జి జిల్లా మేనేజర్ నిత్యానందం, డిప్యూటీ తహసీల్దార్లతో కలిసి సందర్శించారు. సోమవారం 104 లారీలు సమకూర్చి 2,494 మెట్రిక్ టన్నుల ధాన్యం తరలించామన్నారు. 310 కేంద్రాల్లో ధాన్యం కొనుగోళ్లు పూర్తయ్యాయన్నారు. జిల్లాలో ఇప్పటిదాకా 3 లక్షల 4 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసి రైతుల ఖాతాలో రూ. 603 కోట్లు జమచేశామన్నారు.

29న ఇంటర్‌లో స్పాట్ అడ్మిషన్లు

ఎల్లారెడ్డిరూరల్(ఎల్లారెడ్డి) : ఎల్లారెడ్డిలోని గిరిజన బాలికల గురుకుల కళాశాలలో ఇంటర్ ఫస్టియర్‌లో ఈనెల 29న స్పాట్ అడ్మిషన్లు నిర్వహించనున్నట్లు ప్రిన్సిపల్ మౌనిక సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీసీ, బైపీసీలో మిగిలిన రిజర్వుడు కేటగిరిలో సీట్లకు స్పాట్ అడ్మిషన్లు ఇస్తామన్నారు.

ఉత్సాహంగా ఆత్మీయ సమ్మేళనాలు



తాడ్వాయి మండలం కరడ్‌పల్లిలో సమావేశమైన పూర్వ విద్యార్థులు



మాచారెడ్డి మండలం చుక్కాపూర్‌లో..

కామారెడ్డి టౌన్/తాడ్వాయి: పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనాలు ఉత్సాహంగా కొనసాగాయి. తాడ్వాయి మండలం కరడ్‌పల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాల(1995-1996బ్యాచ్)లో, మాచారెడ్డి మండలం చుక్కాపూర్ ఉన్నత పాఠశాల (1999- 2000 బ్యాచ్)లో సమ్మేళనాలను నిర్వహించారు. స్నేహితులందరూ ఒకే వేదికపైకి చేరుకున్నారు. ఒకరి యోగక్షేమాలను మరొకరు తెలుసుకున్నారు. తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులును సన్మానించారు. పాఠశాల చరిత్రలో ఎప్పటికీ గుర్తుండిపోయేలా స్టేజీ నిర్మింపజేస్తామని కరడ్‌పల్లిలో చదివిన విద్యార్థులు నిర్ణయించారు.

క్రైం కార్నర్

మహిళ అదృశ్యం

కామారెడ్డి క్రైం: కామారెడ్డి మున్సిపల్ పరిధిలోని రామేశ్వర్‌పల్లికి చెందిన అలుగునూరి మీన అదృశ్యమైనట్లు దేవునిపల్లి ఎస్సై రాజు సోమవారం తెలిపారు. 26న రాత్రి 10 గంటలకు భోజనం చేసిన తరువాత మీన భర్త నవీన్ ఆరుబయట పడుకోగా, ఆమె ఇంట్లో నిద్రించింది. సోమవారం తెల్లవారుజామున నవీన్‌లేచి చూసేసరికి ఇంటికి తాళం వేసి ఉంది. దీంతో నవీన్ తన భార్య ఆచూకీ కోసం పలు చోట్లు వెతికాడు. నవీన్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రాజు తెలిపారు.

కామారెడ్డి నుంచి మరో వ్యక్తి..

కామారెడ్డి మున్సిపాలిటీ పరిధిలోని రామేశ్వర్‌పల్లికి చెందిన లింగ అఖిల్ అనే వ్యక్తి అదృశ్యమైనట్లు కామారెడ్డి ఎస్‌హెచ్‌వో చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. బైక్ రిపేర్ చేయిస్తానని భార్యకు చెప్పి ఈ నెల 23న సాయంత్రం నాలుగు గంటలకు అఖిల్ బయటికి వెళ్లి తిరిగిరాలేదు. కామారెడ్డి రైల్వే స్టేషన్ పార్కింగ్‌లో వాహనాన్ని పార్కింగ్ చేసి ఎక్కడికో వెళ్లిపోయాడు. తాను ఫోన్ చేస్తే హైదరాబాద్‌లో ఉన్నానని చెప్పాడని, ఆ తరువాత స్విచ్ఛాఫ్ వస్తోందని అఖిల్ భార్య రమ్యశ్రీ పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తుననట్లు ఎస్‌హెచ్‌వో తెలిపారు.

ఆటో, ట్రాక్టర్ ఢీ.. ఒకరి మృతి





గాయపడిన సావిత్రి, పోచవ్వ

ఎల్లారెడ్డి: పట్టణ శివారులో ఆటో, ట్రాక్టర్ ఢీకొన్న ఘటనలో ఒకరు మృతి చెందగా, నలుగురికి గాయాలైనట్లు ఎస్సై మహేశ్ సోమవారం తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి.. లింగంపేట మండలం జల్దిపల్లి గ్రామానికి చెందిన ఆటో ప్రయాణికులను ఎక్కించుకొని జల్దిపల్లికి వెళ్తుండగా కామారెడ్డి వైపు నుంచి ఎల్లారెడ్డి వైపునకు వస్తున్న ట్రాక్టర్ ఆటోను ఢీకొట్టింది. రాంపూర్ గ్రామానికి చెందిన ద్యావల లచ్చవ్వ అలియాస్ రాజవ్వ(40) ఘటనాస్థలంలోనే మృతి చెందింది. అదే గ్రామానికి చెందిన సావిత్రి, పోచవ్వతోపాటు, ఆటో డ్రైవర్ తిరుపతిగౌడ్, ట్రాక్టర్ డ్రైవర్ ప్రవీణ్‌కు గాయాలైనట్లు ఎస్సై తెలిపారు. లచ్చవ్వ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఎల్లారెడ్డి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించామని, కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో యువతికి తీవ్రగాయాలు



ఘటనాస్థలంలో క్షతగాత్రుడు

ఖలీల్‌వాడి: నగరంలోని బైపాస్ రోడ్డు చంద్రశేఖర్ కాలనీకి వెళ్లే చౌరస్తాలో కారు, బైక్ ఢీకొన్న ఘటనలో యువతికి తీవ్రగాయాలయ్యాయి. కంఠేశ్వర్ బైపాస్ రోడ్డు నుంచి కలెక్టరేట్ వైపు వెళ్తున్న కారు చంద్రశేఖర్ కాలనీ చౌరస్తా వద్దకు రాగానే చంద్రశేఖర్ కాలనీ నుంచి స్కూటీ మీద వెళ్తున్న యువతి రోడ్ క్రాస్ చేస్తుండగా, కారు, స్కూటీ ఢీకొన్నాయి. సదరు యువతి ఎగిరి కారు అద్దాలపై పడినట్లు ప్రత్యక్ష సాక్షుల ద్వారా తెలిసింది. ఘటనాస్థలానికి చేరుకున్న పోలీసులు గాయాలపాలైన యువతిని ఆస్పత్రికి, కారు నడిపిన వ్యక్తిని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఘటనపై ఎలాంటి ఫిర్యాదు అందలేదని ఎస్సై ప్రవీణ్‌కుమార్ తెలిపారు.

ఇద్దరు యువకులకు..

బీబీపేట: ఎదురెదురుగా వస్తున్న రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొని ఇద్దరు యువకులకు గాయాలైన ఘటన సోమవారం మండల కేంద్రంలో చోటు చేసుకుంది. ఏఎస్సై ప్రభాకర్ తెలిపిన వివరాల ప్రకారం.. బీబీపేటకు చెందిన ప్రశాంత్ మల్కాపూర్ నుంచి బీబీపేటకు వస్తుండగా మరో గ్రామానికి చెందిన యువకుడు బైక్‌లు ఎదురుగా వచ్చాడు. ఈ క్రమంలో రెండు బైక్‌లు ఎదురెదురుగా ఢీకొన్నాయి. ప్రశాంత్ కాలు విరగగా, మరో యువకుడికి గాయాలయ్యా యి. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించామని, ఘటనపై ఎటువంటి ఫిర్యాదు అందలేదని ఏఎస్సై తెలిపారు.

బాలికపై అత్యాచారయత్నం?

మోపాల్(నిజామాబాద్‌రూరల్): మండలంలోని ఓ గ్రామంలో ఆర్లేళ్ల బాలికపై యువకుడు అత్యాచారయత్నం చేశాడు. ఈ ఘటన ఆదివారం రాత్రి చోటుచేసుకుంది. గ్రామస్తుల కథనం ప్రకారం.. దివ్యాంగుడైన యువకుడు బాధిత బాలికతోపాటు మరికొందరితో నిత్యం ఆడుకుంటాడు. ఆదివారం ఎవరూ లేని సమయంలో వారి ఇంటి పరిసరాల్లో బాలికపై అత్యాచారయత్నం చేస్తుండగా బాలిక ఏడ్చింది. అదేసమయంలో అటుగా వచ్చిన ఆమె తల్లి (పిన తల్లి) అరవడంతో సదరు యువకుడు పరారయ్యాడు. విషయం తెలుసుకున్న బాలిక తాత కోపోద్రిక్తుడై యువకుడి ఇంట్లో నుంచి సామగ్రి బయట పారేసి నిప్పుపెట్టాడు. సమాచారం అందుకున్న పోలీసులు గ్రామానికి చేరుకుని బాలికను ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం బాలిక వైద్యుల పర్యవేక్షణలో ఉండగా, యువకుడిపై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు. బాలిక తండ్రి ఉపాధి నిమిత్తం గల్ఫ్‌కు వెళ్లాడు.

మరో కేసులో ఒకరి రిమాండ్..

భీమ్‌గల్: మండలంలోని ఓ గ్రామానికి చెందిన బాలికపై అత్యాచారం చేసిన వ్యక్తిని రిమాండ్‌కు తరలించినట్లు సమాచారం. విశ్వసనీయ సమాచారం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి.. ఇంటి వద్ద ఉన్న బాలికను ఓ వ్యక్తి తన బైక్ పై ఎక్కించుకొని నిర్మానుష్య ప్రదేశానికి తీసుకెళ్లి దారుణానికి ఒడిగట్టాడు. ఈ నెల 25వ తేదీన ఈ ఘటన చోటుచేసుకోగా, 26వ తేదీన బాధిత బాలిక కుటుంబ సభ్యులు పోలీసులను ఆశ్రయించినట్లు తెలిసింది. కేసు నమోదు చేసిన పోలీసులు నిందితుడిని రిమాండ్‌కు తరలించినట్లు సమాచారం.

హోరాహోరీగా మల్లయోధుల కుస్తీ



కుస్తీ పోటీలో తలపడుతున్న మల్లయోధులు



నగదు అందజేస్తున్న నిర్వాహకులు

నిజాంసాగర్(జుక్కల్): ఊర పండుగల ఉత్సవాల్లో భాగంగా సోమవారం మాగిలో మల్లయోధుల కుస్తీపోటీలు నిర్వహించారు. మహారాష్ట్ర, కర్ణాటక ప్రాంతాల నుంచి మల్లయోధులు కుస్తీ పోటీలకు తరలి రావడంతో పోరు రసవత్తరంగా సాగింది. కొబ్బరి కాయ నుంచి ప్రారంభమైన కుస్తీపోటీలు 5 తులాల వెండి కడియం వరకు నిర్వహించారు. ఆఖరి కుస్తీ పోటీ విజేతకు తన తండ్రి చీకోటి రామకిష్టయ్య జ్ఞాపకార్థం కుమారుడు చీకోటి మనోజ్ పటేల్ 5 తులాల వెండి కడియాన్ని బహుమానంగా అందజేశారు. కుస్తీ పోటీల నిర్వాహకులు గుర్రపు శ్రీనివాస్, పెద్దోళ్ల నారాయణ తదితరులున్నారు.

నగరంలో చోరీ

ఖలీల్‌వాడి: నగరంలోని మూడోటౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఉన్న మార్వెల్ యూపీవీసీ షాపులో దుండగులు చోరీకి పాల్పడినట్లు ఎస్సై ప్రవీణ్ తెలిపారు. సోమవారం ఉదయం 10 గంటలకు మారుతినగర్‌కు చెందిన బ్రహ్మదండి విజయ్‌కుమార్ తన షాపును తెరిచేందుకు వెళ్లగా, తాళాలు పగులగొట్టి ఉన్నాయి. యూపీవీసీ విండోస్ తయారీ యంత్రాలతోపాటు కాపర్ వైర్‌ను దుండగులు ఎత్తుకెళ్లినట్లు గుర్తించాడు. సీసీ కెమెరా డీవీఆర్‌ను సైతం చోరీ చేశారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.